## తెరుచుకున్న ఆలయాలు



జోగుళాంబ ఆలయంలో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

అలంపూర్,అక్టోబర్ 29: అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం మూసివేశారు. మధ్యరాత్రి గ్రహణం పూర్తి కావడంతో ఆదివారం ప్రాతఃకాల ఆలయాల శుద్ధి చేసిన అనంతరం, ఉదయం 9గంటలకు ఆలయం తెరిచి భక్తులను దర్శనానికి అనుమతించారు.

## ఆర్డీఎస్ ఆనకట్టకు తగ్గిన ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 29: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. ఆదివారం ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్‌ఫ్లో 248 క్యూసెక్కులు నమోదైనట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 183 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్‌లో 5.1 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

***టీబీ డ్యాంలో 34.534 టీఎంసీల నిల్వ***

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 34.534 టీఎంసీల నీరు నిల్వఉంది. ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 8,909 క్యూసెక్కులు ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గానూ, ప్రస్తుతం 1608.40 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## బీచుపల్లి క్షేత్రంలో వసతిగృహ నిర్మాణం



పిల్లర్ల నిర్మాణ దశలో కొనసాగుతున్న పనులు

ఇటిక్యాల, అక్టోబర్ 29: బీచుపల్లి క్షేత్రంలోని ఆంజనేయస్వామి సన్నిధిలో స్వామివారి భక్తుడు కొంకల రఘురెడ్డి రూ.కోటి వెచ్చించి భక్తులకు వసతిగృహ నిర్మాణం చేపట్టారు. ఆలయ పరిసరాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనకాల ఆలయానికి చెందిన (150ఫీట్ల పొడవు వెడల్పు స్థలములో) వాహనాల పార్కింగ్, కాంపౌండ్, గార్డెనింగ్ సౌకర్యాలతో అధునాతన 12 వసతి గదులను నిర్మించనున్నారని ఆలయ కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ తెలిపారు. స్వామివారి మొక్కుబడిలో భాగంగా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వేములలో మిలిటరీ కవాతులో సీఐ రాజు, ఎస్సై కృష్ణదేవ

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 29: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ రాజు అన్నారు. ఆదివారం కోదండాపూర్ ఎస్సై కృష్ణదేవ, కేంద్ర బలగాలకు చెందిన 70 మంది సిబ్బందితో వేముల, వల్లూరూ, బోరవెల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

# ఎన్నికల భద్రతపై పోలీసుల ఫోకస్

- ముమ్మరంగా కేంద్రబ లగాల ఫ్లాగ్‌మార్చ్
- సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగాపర్యటన
- ప్రశాంతంగా ఓటింగ్ నిర్వహణకు చర్యలు: సీఐ



అయిజ పట్టణంలో కేంద్ర భద్రతా బలగాల ర్యాలీ (ఫైల్)

అయిజ, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల భద్రతపై పోలీసులు ఫోకస్ పెట్టారు. అలంపూర్ నియోజకవర్గంలోని 290 పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాకు చేరుకున్న కేంద్ర భద్రతా బలగాలతో ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ కేంద్ర భద్రతా బలగాలను మోహరించింది. ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలతో నిఘా పెంచారు. ఎన్నికల దృష్ట్యా రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గంలోని అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, అయిజ, ఇటిక్యాల, రాజోళి, వడ్డేపల్లి, ఎర్రవల్లి మండలాల్లోని గ్రామాలపై పోలీస్ యంత్రాంగం నిఘాను పెంచింది.

**పటిష్ట భద్రతా చర్యలు..**

అసెంబ్లీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని సీఐ శివశంకర్‌గౌడ్ అన్నారు. శాంతినగర్ సర్కిల్ పరిధిలోని అయిజ, వడ్డెపల్లి, రాజోళి మండలాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామని, రౌడీషీటర్లు, పాత నేరస్తుల పట్ల నిఘా పెంచామన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్కిల్ పరిధిలోని పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని అన్నారు.

# ఓటరు నమోదుకు నెలాఖరు గడువు



ఓటుహక్కు వినియోగించుకుంటున్న మహిళా ఓటర్లు (ఫైల్)

- **ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల స్వీకరణ**
- **అయిజ మండలంలో 66,618 మంది ఓటర్లు**
- **మరింత పెరిగే అవకాశం**

అయిజ, అక్టోబర్ 29: ఓటరు నమోదుకు కేవలం మూడు రోజులే గడువు ఉన్నది. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. ఎన్నికలు జరిగే ప్రతిసారి ఓటుశాతం పెంచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఓటరు నమోదుకు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తుంటారు. అంతే కాకుండా విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు ఎంతో విలువైనది. ఓటు వజ్రాయుధంతో సమానమని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తుంటారు. నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నందున ఎన్నికల కమిషన్ చివరి అవకాశంగా ఈ నెల 31వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. టరు నమోదు, ఓటుహక్కు వినియోగం గురించి ఇదివరకే అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాలను ఇందులో భాగస్వాములను చేశారు. ఇప్పటికే ఎన్నికల సంఘం అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల చేసింది. వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 30న ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతి, యువకులు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే సువర్ణావకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యువతి, యువకులకు ఓటుహక్కు కల్పించి పోలింగ్ తేదీ నాటికి ప్రస్తుత ఓటర్ల జాబితాకు అనుబంధంగా ముద్రించనున్నారు.

***మండలంలో 66,618 మంది ఓటర్లు ..***

రాష్ట్ర ఎన్నికల కమిషన్ అక్టోబర్ 4న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో అయిజ మండలంలో 66,618 మంది ఓటర్లు ఉన్నారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని 28 గ్రామాల్లో పురుషులు 33,024, స్త్రీలు 33,591, ఇతరులు 3 ఉన్నారు. పురుషుల ఓటర్ల కంటే స్త్రీలే అధికంగా ఉండటం విశేషం. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చివరి అవకాశం కల్పించడంతో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఓటు వజ్రాయుధంతో సమానం. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటురుగా నమోదు చేసుకోవాలి. ఓటుహక్కు పొందాలని గతంలోనే విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఓటు నమోదు చేశాం. ఓటుహక్కు పొంది ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటును వినియోగించుకోవాలి. ఓటరుగా నమోదైన ఓటర్లు జాబితాలో ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలి. జాబితాలో పేర్లు లేకపోతే విధిగా ఆన్‌లైన్‌లో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి.

**– సాహెదా బేగం, తాసీల్దార్, అయిజ**

## పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 29: కుటుంబ కలహాలతో పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్‌బాబు కథనం మేరకు పెద్దదిన్నె గ్రామానికి చెందిన నర్సింహ(40) డ్రైవర్ వృత్తి, గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు ప్రతిరోజూ తాగివస్తుండగా, కుటుంబ సభ్యులు మందలించడంతో తీవ్ర మనస్థాపం చెందాడు. శనివారం సాయంత్రం పురుగులమందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల దవాఖానకు తరలించారు. ఆదివారం డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లోకి..

గట్టు, అక్టోబర్ 29: మండల కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్‌కు ఉనికి లేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. గట్టు నుంచి బీఆర్‌ఎస్‌లోకి భారీ చేరికలు జరుగుతున్నాయి. బీజేపీ ఓబీసీ మండలాధ్యక్షుడు రాజుగౌడ్‌తోపాటు ఆ పార్టీ నాయకులు హోటల్ మల్లయ్య, అలి బెంచి శివ, మత్స్యకారుల సంఘం మాజీ అధ్యక్షుడు తిమ్మప్ప, ఉడుత తిమ్మప్ప, పెద్దింటి రవి, ఖత్రి లక్షన్నతో పాటు పలువురు గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు హనుమంతునాయుడు, మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.